‘భవిత’కు ఏదీ భరోసా?

- భవిత కేంద్రాల్లోని ప్రత్యేక అవసరాల పిల్లలను ఆదుకోని కూటమి ప్రభుత్వం
- దివ్యాంగులకు అందని పరికరాలు
- వైఎస్సార్‌సీపీ హయాంలో క్రమం తప్పకుండా పరికాల పంపిణీ
- నియోజకవర్గంలో 857 మంది దివ్యాంగ విద్యార్థులు

మానసికంగా, శారీరకంగా అవస్థలు పడుతున్న భవిత కేంద్రాల్లోని ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు ప్రభుత్వం భరోసానివ్వడం లేదు. ఏటా ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి దివ్యాంగ విద్యార్థులకు అవసరమైన పరికరాలు అందజేయాల్సి ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా పట్టించుకోకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దివ్యాంగ విద్యార్థులను గుర్తించి వారికి అవసరమైన పరికరాలను ఏటా అందించేది. పరికరాలను కొనే స్థోమత లేకపోవడంతో ప్రభుత్వ చేయూత కోసం తల్లిదండ్రులు నిరీక్షిస్తున్నారు.


వైఎస్సార్ సీపీ హయాంలో ఆలూరు భవిత కేంద్రంలో దివ్యాంగులకు యంత్ర పరికరాలు అందించిన దృశ్యం (ఫైల్)


దివ్యాంగ విద్యార్థికి ఫిజియో థెరపీ చేస్తున్న వైద్యుడు

ఆలూరు రూరల్: మానసికంగా, శారీరకంగా అవస్థలు పడుతున్న చిన్నారులు, వారి తల్లిదండ్రుల్లో మనోధైర్యాన్ని నింపాల్సి ఉన్నా కూటమి ప్రభుత్వంలో పట్టించుకోవడం లేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో ప్రత్యేక అవసరాల పిల్లలకు పెద్దపీట వేసింది. ఏటా ప్రత్యేక క్యాంపులు నిర్వహించి వారికి అవసరమైన యంత్ర పరికరాలను క్రమం తప్పకుండా అందజేసింది. ప్రస్తుతం నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోని భవిత కేంద్రాల్లో 857 మంది దివ్యాంగులున్నారు.

దివ్యాంగులకు అందని పరికరాలు..

ఏటా జిల్లా, మండల కేంద్రాల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహించి ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించి ఆయా మండలాల పరిధిలోని భవిత కేంద్రాల్లో చేర్పించే కార్యక్రమం నిర్వహిస్తున్నారు ఈ ఏడాది అక్టోబర్ నెలలో అన్ని మండల కేంద్రాల్లో క్యాంపులు నిర్వహించి 152 మంది ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించినట్లు అధికారులు పేర్కొంటున్నారు. భవిత కేంద్రంలో చేర్పించే వారికి వెంటనే యంత్ర పరికరాలు అందించాల్సి ఉంది. ఈ ఏడాది అర్హత పొందిన దివ్యాంగ విద్యార్థులకు నేటికీ వినికిడి యంత్రాలు, వీల్ చైర్స్, ట్రై సైకిళ్లు, చంక కర్రలు తదితర పరికరాలు అందించలేదు. తల్లిదండ్రులకు అందించే అలెవెన్సులు కూడా రా లేదు. నిధులు విడుదలయ్యాయి త్వరలో జమ అవుతా యని అధికారులు చెపుబుతున్నా రోజులు గడుస్తున్నా, వారికి ఆ సొమ్ము ముట్టలేదు. నూతన విద్యా పాలసీ ప్రకారం ప్రస్తుతం పాఠశాల భవనాలనే భవిత కేంద్రా లుగా మార్చి అన్ని మండలాల్లో విద్యా, శిక్షణ ఇవ్వాల్సి ఉంది. ఆలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ప్రత్యేక అవసరాల పిల్లలు 857 మంది ఉన్నారు. వారు వివిధ సమీప పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్నారు. వీరికి భవిత కేంద్రాల్లో ప్రతి సోమవారం ఫిజియోథెరపీ క్యాంప్ నిర్వహించి, ప్రత్యేక శిక్షణ పొందిన వైద్యులు చిన్నారులకు శిక్షణ ఇస్తున్నా పరికరాలు అందకపోవడంతో శ్రమ వృథా అవుతోంది.

వైఎస్సార్‌సీపీ హయాంలో..

గతంలో ఏటా సెప్టెంబర్ లేదా అక్టోబర్ నెలలో కొత్తగా చేరిన ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ప్రత్యేక శిబిరాలు నిర్వహించి వారికి అవసరమైన పరికరాలను క్రమం తప్పకుండా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందజేసింది. అయితే ఈ ఏడాది ఇంత వరకు ప్రభుత్వం పరికరాల గురించి పట్టించుకోకపోవడంతో దివ్యాంగ విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. అలాగే వాటిని సొంతంగా కొనుగోలు చేసే స్థాయి తల్లిదండ్రులకు లేకపోవడంతో ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నాలుగు సార్లు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి 360 మంది దివ్యాంగ విద్యార్థులకు వివిధ రకాల పరికరాలను అందజేసింది.

ఈ ఏడాది ప్రత్యేక క్యాంపుల్లో అర్హత సాధించిన దివ్యాంగులు మండలాల వారీగా..

మండలం	అర్హత పొందిన దివ్యాంగులు
ఆలూరు	60
ఆస్పరి	27
చిప్పగిరి	9
హాలహర్వి	10
హొళగుంద	10
దేవనకొండ	36

పరికరాలు అందిస్తాం



ఈ ఏడాది ప్రత్యేక క్యాంపులో అర్హత పొందిన దివ్యాంగులకు యంత్ర పరికరాలు రాలేదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే పంపిణీ చేస్తామని చెప్పారు. ప్రతి సోమవారం భవిత కేంద్రాల్లో ఫిజియో థెరపీ చేయిస్తున్నాం. వారికి అర్థమయ్యే రీతిలో విద్యను బోధిస్తున్నాం.
– రామదాసు, ఐఈఆర్పీ, ఆలూరు


ఆలూరు భవిత కేంద్రంలో దివ్యాంగులకు పాఠాలు బోధిస్తున్న ఐఈఆర్పీ

క్లుప్తంగా

ఎస్సీ హాస్టల్ తనిఖీ


ఎస్సీ హాస్టల్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ విశ్వమోహన్

తుగ్గలి : మండలంలోని పెండేకల్లు రైల్వే జంక్షన్‌లోని ఎస్సీ హాస్టల్‌ను ఎంపీడీఓ విశ్వమోహన్ బుధవారం తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి భోజన నిర్వహణపై ఆరా తీశారు. హాస్టల్‌లో ఉన్న సరుకులు, కూరగాయలను పరిశీలించారు. విద్యార్థులను ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని వార్డన్ సుంకన్నకు సూచించారు. అనంతరం విద్యార్థులకు కార్పెట్లు పంపిణీ చేశారు. హాస్టల్‌కు నూతన భవనం మంజూరు చేయించాలని వార్డన్ ఎంపీడీఓకు వినతి పత్రం అందజేశారు.

విద్యార్థులకు లంచ్ బాక్సుల పంపిణీ


విద్యార్థులకు లంచ్ బాక్సులు అందజేస్తున్న దృశ్యం

హొళగుంద: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఏరిస్ కంపెనీ ప్రతినిధులు బుధవారం ఉచితంగా లంచ్ బాక్సులు అందజేశారు. కంపెనీ 56వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని జనరల్ సౌత్ డిప్యూటీ డైరెక్టర్ జయప్రదీప్ సుబ్రమణ్యన్, రాయలసీమ రీజనల్ మేనేజర్ సురేష్, స్థానిక డీలర్ సైపుల్లా, ప్రతినిధులు గణేష్, హస్వంత్‌రెడ్డి, ఎక్స్‌టెన్సన్ ఆఫీసర్లు..హెచ్‌ఎం నజీర్ అహమ్మద్ ఆధ్వర్యంలో 250 మంది విద్యార్థులకు లంచ్ బాక్సులను అందజేశారు.

మైక్రోన్యూట్రియన్స్‌పై విద్యార్థులకు అవగాహన

కృష్ణగిరి: పంటల సాగు విధానంలో పాటించాల్సిన నియమాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని హెచ్‌ఎం గోవిందురెడ్డి అన్నారు. మండలంలోని కటారుకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఏరిస్ కంపెనీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు మైక్రోన్యూట్రియన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం 80 విద్యార్థులకు లంచ్ బాక్స్‌లు అందజేశారు.

విద్యుత్ షాక్‌తో రైతుకు తీవ్ర గాయాలు


ఈడిగ విరుపన్నను చికిత్స నిమిత్తం తరలిస్తున్న దృశ్యం

హొళగుంద: మండల కేంద్రానికి చెందిన ఈడిగ విరుపన్న అనే రైతు బుధవారం పొలంలో విద్యుత్ షాక్‌తో తీవ్ర అస్వస్థతకు గురైయ్యాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. విరుపన్న తన పొలంలో తెగిపడిన బోరు బావి త్రీఫేస్ లైన్ సర్వీస్ వైర్‌కు తిరిగి కనెక్షన్ ఇచ్చే క్రమంలో విద్యుత్ షాక్ కొట్టింది. దీంతో అక్కడికక్కడే కుప్పుకూలి అపస్మారకస్థితిలో వెళ్లిపోయాడు. కుటుంభ సభ్యులు స్థానిక పీహెచ్‌సీకీ తరలించగా ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉందని మెరుగైన చికిత్స కోసం ఆదోనికి తీసుకెళ్లాలని సూచించగా.. కుటుంబ సభ్యులు బళ్లారికి తరలించారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ, ఎంఈఓ

మద్దికెర : స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనాన్ని ఎంపీడీఓ కొండయ్య, ఎంఈఓ రంగస్వామి బుధవారం పరిశీలించారు. వంట నిర్వాహకులు మెనూ ప్రకారం భోజనాన్ని విద్యార్థులకు అందించాలని సూచించారు. నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవన్నారు. ఈ సందర్భంగా వంట ఏజెన్సీ వారు మాటాల్లుతూ..కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇతర గ్రూపుల వారు తాము మధ్యాహ్న భోజనం వండుతామని వంట పాత్రలు కూడా తెచ్చిపెట్టారని, అందులో భాగంగానే అధికారులు భోజనాన్ని పరిశీలించారని చెప్పారు. 20 ఏళ్లుగా ఎలాంటి ఆరోపణలు లేకుండా వంట అందిస్తున్నామని పేర్కొన్నారు.

అక్రమ కేసులు తగదు

పత్తికొండ(తుగ్గలి) : ఎలాంటి తప్పు లేకున్నా వ్యభిచారం కేసులో ఇద్దరి మైనర్లను ఇరికించారంటూ బుధవారం బాధిత కుటుంబాల సభ్యులు పట్టణంలో ఆందోళన చేపట్టారు. వ్యభిచార గృహంపై దాడిచేసి మంగళవారం పలువురిని అదుపులోకి తీసుకున్నారు. ఇందులో అభం శుభం తెలియని ఇద్దరి మైనర్లను కేసులో ఇరికించారని బాధిత కుటుంబాల మహిళలు ఆరోపించారు. అసలు పత్తికొండలో ఏ జరుగుతోందంటూ వాపోయారు. అక్రమ కేసు బనాయించడంతో పిల్లల జీవితాలు నాశనమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు.

పప్పు శనగలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి


మద్దికెర వద్ద ఏపుగా పెరిగిన పప్పుశనగ పైరు

మద్దికెర : మద్దికెర మండలంలో దాదాపు 20 వేల ఎకరాల్లో పప్పుశనగ పంటను సాగు చేశారని, ప్రస్తుతం పచ్చ రబ్బరు పురుగు, శనగ పచ్చ పురుగు, లద్దె పురుగులు పంటలను ఆశిస్తున్నాయని సకాలంలో సస్యరక్షణ పద్ధతులు పాటించి పంటలను కాపాడుకోవాలని ఏఓ రవి సూచించారు. బుధవారం మద్దికెర, ఎం.అగ్రహారం గ్రామాల్లో పప్పు శనగ పంటలను పరిశీలించారు. పురుగుల నివారణకు క్లోరందానిలిప్రోల్ (కొరజాన్) ఎకరాకు 60 ఎంఎల్ లేదా క్లోరందానిలిప్రోల్‌తో పాటు లామ్డా సైహలోత్రిన్ (అంప్లిగో)ఎకరాకు 100 మి.లీ లేదా టెట్రానిలిప్రోల్ (వయోగో) 100 మి.లీ ఎకరాకు పిచికారీ చేసుకోవాలన్నారు. అలాగే శనగలో 30–45 రోజుల దశలో మొక్కలు అక్కడక్కడా పసుపురంగుగా మారి చనిపోతాయన్నారు. నివారణకు కార్బండిజమ్ (బావిస్టన్) 2 గ్రాములు లేదా సాఫ్ 2 గ్రాములు లీటరు నీటిలో కలిపి స్ప్రే చేయాలని సూచించారు. వాతావరణంలో మార్పులు కారణంగా శనగ, వాము పంటలో ఆకులు పసుపు పచ్చగా మారుతున్నాయని దీనిని తగ్గించుకోడానికి ఎకరాకు ఒక కిలో 13–0–45 ఫార్ములా –4 అరకిలో కలిపి మొక్కలు తడిచేలా పిచికారీ చేయాలని చెప్పారు. అలాగే కంది పంటలో కాయ ఈగ నివారణకు (ఫ్లూబెండామైండ్ మరియు థయోక్లోప్రిడ్)బెల్ట్ ఎక్స్‌పర్ట్ ఎకరాకు 100 మి.లీ పిచికారీ చేసుకోవాలన్నారు.

వ్యవసాయంలో సాంకేతికతను వినియోగించాలి


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ సునీత

చిప్పగిరి: మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు వ్యసాయంలో సాంకేతికతను వినియోగించాలని ఏడీఏ సునీత సూచించారు. బుధవారం మండలంలోని నేమకల్లు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం ఏఓ విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు సాగులో నూతన విధానాలు, ఆధునిక పనిముట్లు , యంత్రాల వినియోగం, తెగుళ్ల నివారణకు చేపట్టాల్సిన ముందస్తు చర్యలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సర్పంచ్ ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

సారా స్థావరాలపై దాడులు


నాటుసారా ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ సీఐ విశ్వేశ్వరరావు, సిబ్బంది

తుగ్గలి : మండలంలోని రోల్లపాడుతండ, ఎల్లమ్మ గుట్ట తండాల్లో బుధవారం నాటుసారా స్థావరాలపై పత్తికొండ ఎక్సైజ్ సీఐ విశ్వేశ్వరరావు, కర్నూలు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సుభాషిణి ఆధ్వర్యంలో ఏసీ ఈఎన్‌ఫోటీ, ఈఎస్‌టీఎఫ్ బృందాలు దాడులు చేశాయి. దాడుల్లో నాటుసారాకు తయారీకి ఉపయోగించే 3,200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఎవరైనా నాటుసారా తయారుచేసినా, అమ్మినా కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షిస్తామని సీఐ విశ్వేశ్వరరావు హెచ్చరించారు. ఎస్ఐలు ప్రవీణ్, ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

బెల్లం ఊట ధ్వంసం

హొళగుంద: మండలంలోని నెరణికి తండా కొండల్లో బుధవారం హొళగుంద ఎస్ఐ బాల నరసింహులు ఆధ్వర్యంలో పోలీసులు నాటుసారా స్థావరాలపై దాడులు చేపట్టారు. కొండల్లో ఉన్న నాటుసారా స్థావరాల్లో సారా తయారీకి భూమిలో దాచి పెట్టిన బెల్లం ఊట డ్రమ్ములు, బిందెలను గుర్తించి వాటిల్లో నిల్వ ఉంచిన 400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. అలాగే నెరణికి తండాకు చెందిన మల్లికార్జునను అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 15 లీటర్ల నాటుసారా సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

మద్యం విక్రయాలకే ప్రభుత్వ ప్రాధాన్యం

పత్తికొండ(తుగ్గలి) : కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలు విస్మరించి మద్యం విక్రయాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోందని సీపీఐ మండల కార్యదర్శి రాజాసాహెబ్, జిల్లా సమితి సభ్యులు గురుదాస్, సురేంద్రకుమార్, కృష్ణయ్య, కారన్న, తిమ్మయ్య విమర్శించారు. వైన్‌షాపుల పక్కన సిట్టింగ్ రూంలు, గ్రామాల్లో బెల్టు షాపులు లేకుండా చూడాలని డిమాండ్ చేస్తూ బుధవారం పట్టణంలోని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. మద్యం షాపుల పక్కనే సిట్టింగ్ రూంలు ఏర్పాటు చేయడంతో పాటు, గ్రామాల్లో విచ్చల విడిగా బెల్టు షాపుల పెట్టి మద్యం అమ్మకాలు చేస్తున్నారన్నారు. మద్యంతో పేదల జీవితాలు నాశనమవుతున్నాయనిఇప్పటికైనా సిట్టింగ్ రూంలు, బెల్టుషాపులు రద్దు చేయాలని లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. పార్టీ పట్టణ సహాయ కార్యదర్శి సుంకన్న, రైతు సంఘం మండల కార్యదర్శి సిద్దు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత



పత్తికొండలో ప్రతిజ్ఞ చేస్తున్న ప్రిన్సిపాల్, న్యాయవాదులు, జొన్నగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పత్తికొండ(తుగ్గలి) : బాల్య వివాహాల నిర్మూలన మనందరి బాధ్యత అని ప్రిన్సిపాల్ నయిమున్నీసాబీ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో బుధవారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవాదులు నాగేష్, సూరజ్‌నవీ బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, గృహ హింస చట్టాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ చదువు కోవడం వల్ల బాల్య వివాహాల నిర్మూలన సాధ్యమన్నారు. మహిళలు గృహ హింసను ఎదుర్కొనేందుకు అనేక చట్టాలు ఉన్నాయన్నారు. వాటిపై అవగాహన పెంచుకోవాలని చెప్పారు.

లింగ వివక్షను నిర్మూలిద్దాం..

జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా జొన్నగిరిలో వెలుగు ఆధ్వర్యంలో పొదుపు సంఘాల మహిళలు ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. సమాజంలో లింగ వివక్ష లేకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఏపీఎం రాధాకృష్ణ అన్నారు. పనిప్రదేశంలో, ఇళ్లలో మహిళలు హింసకు గురికాకుండా చూడాలని కోరారు. హెచ్‌డీ సీసీ ఓబులేసు,వీవోఏలు పాల్గొన్నారు.

బాల్య వివాహం చట్టరీత్యా నేరం

ఆలూరు రూరల్: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, అందుకు శిక్షార్హులవుతారని ఆలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వాయుజీవోత్తమ రావు అన్నారు. బాల్య వివాహ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలో పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. బాల్య వివాహాలు ఓ సాంఘిక దురాచారమన్నారు. బాలిక కనీస వయస్సు 18 ఏళ్ల నిండితేనే వివాహం చేయాలన్నారు. పెళ్లితో విద్య, రక్షణ, ఆరోగ్యం బాలికల అభివృద్ధికి ఆటకం కలిగిస్తుందన్నారు. న్యాయవాది షాకీర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, కేజీబీవీ విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

గోకులం షెడ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

హాలహర్వి: మినీ గోకులం షెడ్డు నిర్మాణం పనులు త్వరగా పూర్తి చేసుకోవాలని అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ డ్వామా పద్మావతి అన్నారు. బుధవారం మండలంలోని మెదేహాల్ గ్రామంలో భారీ వర్షాలకు పూడికతో నిండి పోయిన రైతు హరినాథ్‌రెడ్డి పంట పొలాన్ని, మినీ గోకులం షెడ్ నిర్మాణ పనులను పరిశీలించారు. సీఎల్‌ఆర్‌సీసీడీ సురేష్‌బాబు, ఏపీఓ చక్రవర్తి, ఈసీ దేవదాసు, టెక్నికల్ అసిస్టెంట్, క్లస్టర్ టీఏలు ఉలిగప్ప, సురేష్, రాముడు, ఫీల్డ్ అసిస్టెంట్ ఏకాంత పాల్గొన్నారు.

తుగ్గలిలో..

తుగ్గలి : ఉపాధి హామీ పథకం కింద మంజూరైన మినీ గోకుల షెడ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని ఏపీఓ హేమసుందర్ సూచించారు. స్థానిక స్త్రీశక్తి భవన్‌లో బుధవారం ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించి ఉపాధి పనులపై సమీక్ష నిర్వహించారు. పని కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి కూలీకి ఉపాధి పని కల్పించాలన్నారు. ఉపాధి పనులపై గ్రామాల్లో అవగాహన పెంచి కూలీల వలసలను నివారించాలన్నారు. పనులు పారదర్శకంగా చేపట్టాలని, అక్రమాలు జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. డిసెంబర్ లోగా గోకుల షెడ్ల నిర్మాణాలను రైతులు పూర్తి చేసుకునేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. ఈసీ ప్రదీప్‌కుమార్ ఉన్నారు.

నేడు తలనీలాల వేలాలు

మద్దికెర : మండలంలోని పెరవలి గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీరంగనాథస్వామి దేవాలయంలో సంవత్సరం పాటు తలనీలాలు ప్రోగు చేసుకునేందుకు గురువారం ఉదయం 10:30 గంటలకు దేవాలయ ఆవరణలో వేలాలు నిర్వహించనున్నట్లు ఈఓ వీరయ్య బుధవారం తెలిపారు. వేలంలో పాల్గొనే వారు తలనీలాలు ప్రోగు చేసుకునే హక్కుకు రూ.లక్ష దరావత్తు చెల్లించాలన్నారు. అన్యమతస్తులు వేలం పాటల్లో పాల్గొనరాదని చెప్పారు. దేవదాయశాఖ నిబంధనల మేరకు వేలాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ఉపాధి పనులు గుర్తించండి

మద్దికెర : మండలంలోని ఆయా గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించేందుకు రైతులకు అవసరమైన పనులు గుర్తించాలని ఏపీఓ నర్సిరెడ్డి తెలిపారు. బుధవారం ఉపాధి కార్యాలయంలో సిబ్బంది సమావేశం నిర్వహించారు. గ్రామాల్లోని పొలాలలో పంటలకు ఉపయోగపడే పనులు గుర్తించి రైతుల ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్ బుక్, జాబ్‌కార్డు జిరాక్స్‌లు కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

భగవద్గీత విశిష్టతపై ప్రచారం

కృష్ణగిరి: కార్తీక మాసంలో దీపాలు వెలిగించడం, అందులోని జ్ఞానాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని కోయిలకొండ త్రైత సిద్ధాంత ప్రభోద సేవాసమితి అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. మండలంలోని చుంచుఎర్రగుడి, సంగాల గ్రామాల్లో బుధవారం వారు కార్తీక మాసంలో వెలిగించే దీపారాధ విశిష్టత, భగవద్గీతపై ప్రచారం చేశారు. సభ్యులు గంగాధర్, శ్రీరాములు, శ్రీకాంత్, యశోద, లక్ష్మమ్మ, చెన్నకేశవులు పాల్గొన్నారు.

రేపు లక్ష దీపోత్సవం

వెల్దుర్తి(కృష్ణగిరి): మండల పరిధిలోని బొమ్మిరెడ్డిపల్లె గ్రామంలోని భీమలింగేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 29వ తేదీన లక్ష దీపోత్సవం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలి

హొళగుంద: మండల కేంద్రంలో రెగ్యులర్ ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలని ఎస్డీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఆలూరు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి సుభాన్, ఉపాధ్యక్షుడు అబ్దుల్ రెహమాన్ తదితరులు ఈఓపీఆర్డీ చక్రవర్తికి బుధవారం వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మండలంలో 17 గ్రామ పంచాయతీలకు సంబంధించి 26 గ్రామాలున్నాయని అయితే మండల కేంద్రంలో రెగ్యులర్ ఆధార్ సెంటర్ లేకపోవడంతో అవసరమైన వారు ఆదోని, ఆలూరుకు పరుగులు తీయాల్సి వస్తోందన్నారు. ఎంపీడీఓ కార్యాలయం, సచివాలయాల్లో రెండు, మూడు నెలలకో సారి కేవలం నాలుగైదు రోజులు మాత్రమే ప్రత్యేక శిబిరం నిర్వహించినా, సరైన సమాచారం లేక ప్రజలు ఆయా కేంద్రాలను వినియోగించుకోలేకపోతున్నారన్నారు.

రెచ్చగొట్టే పోస్టులు పెడితే చర్యలు

ఆలూరు రూరల్: సోషల్ మీడియాలో రాజకీయంగా రెచ్చగొట్టే వ్యాఖ్యలు పోస్టు చేస్తే కేసు నమోదు చేస్తామని ఎస్ఐ దిలీప్ కుమార్ హెచ్చరించారు. బుధవారం రాత్రి మండలంలోని కురువళ్లి గ్రామంలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సోషల్ మీడియాలో వచ్చే ప్రకటనలతో మోసపోవద్దన్నారు. అపరిచిత వ్యక్తులకు ఫోన్ కాల్స్‌కు ఓటీపీలు చెప్పరాదన్నారు. సైబర్ నేరాల కరపత్రాలను గ్రామస్తులకు అందజేశారు.

ఆ కుంటలోని చేపలను ముట్టరు!



ఆహార పదార్థాలను తీనేందుకు బయటకు వచ్చిన చేపలు, కలపరి కొండల్లో వెలసిన గంగమ్మవ్వ

ఒక్కో ప్రాంతానిది ఒక్కో ప్రత్యేకత. కొన్ని వినడానికి వింతగా, కొత్తగా ఉంటాయి. ఈ కోవలోకే వస్తుంది ఆస్పరి మండలంలోని కలపరి గ్రామ సమీపంలోని గంగమ్మవ్వ దొని (కుంట). ఈ కుంటలో విస్తారంగా చేపలున్నప్పటికీ స్థానికులు వాటిని సేకరించి తినరు. సాధారణంగా కుంటల్లోని చేపలను వలల సాయంతో పట్టి తీసుకెళ్లడం చూస్తుంటాం. కలపరి గ్రామ సమీపంలోని కొండల్లో గంగమ్మవ్వ వెలసింది. ఆలయ ఆవరణలో ఉన్న కుంటలోని చేపలను ఇప్పటి వరకు ఎవరూ పట్టుకోకపోవడం విశేషం. ఈ కుంటలోని చేపలు సుమారు 5–10 కిలోల బరువుంటాయని, అయినా వాటిని చూడటమేకానీ పట్టుకునే సాహసం చేయరు. భక్తులు, స్థానికులు కుంట వద్దకు వెళ్లి చేపలకు ఆహారం వేసి వస్తుంటారు. ఈ సమయంలో గుంపులు గుంపులుగా చేపలు వచ్చి తినే దృశ్యాలు ఆకట్టుకుంటాయి. ఆహారం తినే సమయంలో మనుషులు ఎదుట ఉన్నా వేసిన ఆహారం అయిపోయేంత వరకు చేపలు నిర్భయంగా తింటుండటం ఆశ్చర్యకరం. ఈ కుంటలోని చేపలను పట్టుకుని తినడం అరిష్టం, అపచారంగా పరిసరాల్లోని యాటకల్లు, తొగలుగల్లు, దొడగొండ, గార్లపెంట, బైలు పత్తికొండ, కైరుప్పల, కారుమంచి తదితర గ్రామాల ప్రజలు, భక్తుల నమ్మకం. – ఆస్పరి

నివేదికలు చదివి వెళ్లిపోతే ఎలా?


విద్యుత్ అధికారులను నిలదీస్తున్న చిప్పగిరి సర్పంచ్ దాసరి గోవింద రాజులు

చిప్పగిరి: అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలు చదివి వెళ్లిపోతే ఎలా అని ఎంపీపీ జూటూరు హేమలత అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్, విద్య, వైద్య, ఉపాధి,వెటర్నరీ అధికారుల పనితీరుపై చిప్పగిరి, డేగులహాలు, కుందనగుర్తి, ఏరూరు, నగరడోణ తదితర గ్రామాల సర్పంచులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సభ్యులు లేవనెత్తిన అంశాలపై వాడీ వేడిగా చర్చించారు. తహసీల్దార్ ఇజాజ్ అహమ్మద్, సూపరింటెండెంట్ శ్రీనివాసులు, ఈఓపీఆర్డీ బాలన్న, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిద్దాం

వెల్దుర్తి(కృష్ణగిరి): అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేసి మండలాన్ని అన్ని అభివృద్ధి చేద్దామని ఎంపీపీ మిద్దె రంగయ్య కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీఓ సుహాసినమ్మ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. జెడ్పీటీసీ సుంకన్న మాట్లాడుతూ మూడు నెలలకు ఒకసారి జరిగే సమావేశాలకు అధికారులు తప్పక హాజరుకావాలన్నారు.ఈఓఆర్డీ రవికిషోర్, ఏఓ అక్బర్‌బాషా, ఏపీఎం అనురాధ, ఏపీఓ లక్ష్మన్న, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.


గూళ్యం గ్రామం నుంచి వేదావతి నదిపై తాత్కాలిక రోడ్డు ఏర్పాటు చేస్తున్న గ్రామస్తులు

వేదవతిపై తాత్కాలిక రహదారి

ఆలూరు: ఆంధ్ర,కర్ణాటక రాష్ట్రాలకు సరిహద్దు గ్రామాలకు వేదావతినదిపై వెళ్లేందుకు గూళ్యం గ్రామస్తులు తాత్కాలికంగా రహదారిని ఏర్పాటు చేస్తున్నా రు. రెండు రోజుల నుంచి మూడు ప్రొక్లెయిన్ల ద్వారా ఇసుకను లెవెలింగ్ చేస్తూ.. అవసరమైన నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా పైపులు ఏర్పాటు చేస్తున్నారు. గూళ్యం గ్రామంలో కొలువుదీరిన శ్రీ గాదిలింగప్పతాతను దర్శించుకునేందుకు వచ్చే భక్తుల కోసం గ్రామస్తులు సుమారు రూ.3లక్షలు పోగు చేసుకుని తాత్కాలిక రహదారి నిర్మిస్తున్నారని ఆలయ అర్చకులు, గ్రామస్తులు తెలిపారు.

పంటల బీమా చేయించుకోండి

హాలహర్వి: రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు వెంటనే పంటల బీమా చేయించుకోవాని ఏఓ శివశంకర్ సూచించారు. బుధవారం మండలంలోని మెదేహాల్, కామినహాల్ గ్రామాల్లో ॥పొలం పిలుస్తోంది॥ కార్యక్రమం నిర్వహించారు. ఎకరాకు..జొన్న పంటకు రూ.297, శనగకు ఎకరాకు రూ.420 చొప్పున ప్రీమియం చెల్లించాలన్నారు. ఎంపీఈఓ సూరన్న, ఏఈఓ శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.